# పాడవోయీ భారతీయుడా...




**మా**కాలనీ వాళ్ళది చాలా విచిత్రమైన సైకాలజీ!

ఎప్పుడే పిచ్చి పడుతుందో ఎవ్వరం చెప్పలేము. ఎందుకంటే నేనూ అందులో ఉన్న వాడినేగా!

ఉదాహరణకి పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చేట్లు కనిపించిందనుకోండి. వెంటనే టీవీ మనల్ని చిత్రవధ చేయటం ప్రారంభిస్తుంది చాలా సిస్టమేటిక్‌గా!

ముందు దేశభక్తి గీతాలు మొదలవుతాయ్. అవి అయిపోగానే అడ్డమయినాడూ స్క్రీన్ మీద కొచ్చి స్వాతంత్ర్యోద్యమం గురించి నోటికొచ్చింది చెప్పటం మొదలెడతాడు.

అది అయిపోగానే చిత్రహార్ వస్తుంది. అందులో అన్నీ దేశభక్తి ఉన్న చిత్రాల పాటలే వస్తాయి.

అదీ సహించి ఇంకా మిగిలామనుకోండి.

దేశం కోసం అవసరం లేకపోయినా ఇంటినీ ఇల్లాలినీ అన్నీ త్యాగం చేసి వెళ్ళిపోతాడు హీరో.

ప్రోగ్రామ్‌కీ ప్రోగ్రామ్‌కీ మధ్యలో ఓ బండగొంతు నినాదాలు చదవటం ప్రారంభిస్తుంది.

"దేశమంటే మట్టికాదోయ్– దేశమంటే మనుషులోయ్"

"నీకోసం దేశం– దేశం కోసం నువ్వు"

"మనిషికన్న ఊరు గొప్ప– ఊరుకన్న దేశం గొప్ప"

"జై జవాన్ – జై కిసాన్"

"రక్తదానం – అన్ని దానాల్లోకి గొప్పది"

"సైనికుల కోసం రక్తం ఇవ్వు"

"నీకోసం దేశం ఏమి చేసిందన్నది కాదు! దేశం కోసం నువ్వేం చేశావ్ అన్నది ముఖ్యం"

ఎందుకో ఆ స్లోగన్ రంగారెడ్డికి అమితమయిన కోపం కలిగిస్తుంది.

"ఏమిటా పిచ్చివాగుడు? దేశం కోసం మనం ఏం చేస్తాం? మనం ఎలక్షన్స్‌లో ఏదొక పార్టీని ఎన్నుకుంటోంది ఎందుకు? దేశంకోసం పాటుబడమనేగా? మళ్ళీ వాళ్ళు టీవీలో దేశం కోసం నువ్వేం చేశావ్ అని మన్నడుగుతారేమిటి?" అంటాడతను.

అది నిజమే అనిపించింది నాక్కూడా.

"ఒకవేళ వాళ్ళేమీ చేయలేక మనని సహాయం చేయమంటున్నారేమో–"

"అంత చేతకాని వెధవల్ని ఎలక్షన్లో ఎవడు నుంచోమన్నాడు. ముందే ఆ విషయం ఏడుస్తే ఇంకో పార్టీని గెలిపించే వాళ్ళంకదా"

ఇలా సాగిపోతుంది.

ఒకవేళ సైక్లోన్ వచ్చిదనుకోండి. వెంటనే టీవీ ఆన్ చేస్తే చాలు ఏడుపు ముఖంతో ఓ ఎనౌన్సర్ కూర్చుని ఉంటాడు.

అతనినేమయినా పలుకరిస్తే చాలు భోరుమంటాడేమో అని మనకు భయం వేస్తుంది.

"తోటివారికి సాయం చేయటం మానవ ధర్మం" అంటాడతను.

"సైక్లోన్ బాధితులకు విరివిగా విరాళాలివ్వండి" అంటాడు ఇంకోడు.

"ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలివ్వండి– లేదా ప్రధానమంత్రి నిధికి విరాళాలివ్వండి!" అంటూ ఇంకొకడు దీనంగా చూస్తాడు.

వెంటనే కాలనీ వాళ్ళందరం తెగ జాలిపడి వాళ్ళకు తలో కొంచెము విరాళాలిస్తాం!

రంగారెడ్డికి అది కూడా నచ్చదు.

"ఈ గవర్నమెంట్ ఇంత సిగ్గుమాలిన గవర్నమెంటయిపోయిందేమిటి? వానొచ్చినా, వరదొచ్చినా, క్షామం వచ్చినా అడుక్కోవటానికి రడీ అయిపోతుంది. పైగా పాపం ఆ బాధితులను టీవీలో, సినిమా న్యూస్ రీల్‌లో అడుక్కునేవాళ్ళలా చూపిస్తుంది. సెంటిమెంట్

వర్కవుట్ అయేట్లు చేసి ప్రజల్నుంచి డబ్బులు లాగాలని ప్లాన్! అంతేగానీ మనం ఈ ప్రభుత్వాన్ని ఎన్నుకుంది "ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలొచ్చినప్పుడు నువ్ చేతులెత్తెయ్– మేము చూసుకుంటాం" అని కాదు గదా! ఆ బాధితులకు సౌకర్యాలు సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిది! ప్రజలు ఆసౌకర్యాలు కోరటం వాళ్ళ పౌరహక్కు! అంతేగాని పాపం వాళ్ళు అడక్కుండానే అడుక్కునే వాళ్ళలాగా చేసి వాళ్ళకు దానం చేయండి అని వాళ్ళ పరువు తీసేయటం, పెద్ద నేరం!" అంటూంటాడు.

సరే– ఆ గొడవలలా ఉండగా ఈ మధ్య ప్రధానమంత్రి దేశం కోసం అందరూ త్యాగాలు చెయ్యాలని పదే పదే స్టేట్‌మెంట్స్ ఇవ్వటం మేమంతా చూస్తూనే ఉన్నాం! అది చూసి టీవీలో మళ్ళీ నినాదాలు ప్రారంభమయిపోయినయ్.

"నీ త్యాగమే నీకు శ్రీరామరక్ష / అల్లారక్ష /జీసస్‌రక్ష / బుద్ధునిరక్ష" (సెక్యులర్ స్లోగన్ కదా)

"దేశం పిలుస్తోంది! కదలిరా!"

"నీ కోసం దేశం కాదు! దేశం కోసం నువ్వు"

"మనది భారతదేశం– మనమంతా భారతీయులం!"

"పొదుపు మన కర్తవ్యం!"

"ప్రతి నీటి చుక్కా ప్రగతికి సోపానం"

"విద్యుత్‌ని ఆదా చేయండి– దేశ సౌభాగ్యానికి తోడ్పడండి"

"నేటి పొదుపే రేపటి మదుపు"

"పెట్రోల్‌ని ఆదా చేయండి! విదేశీ మారకాన్ని మిగల్చండి"

"అవసరమయితేనే ప్రయాణం చేయండి"

"చెట్లు పెంచండి! పర్యావరణాన్ని కాపాడండి"

"చెట్లు నరకడాన్ని నిరసించండి"

"దుబారా చేయకండి"

అలాంటివన్నీ తెగ చూడటం, వినటం జరిగేసరికి మా కాలనీ వాళ్ళందరికీ మళ్ళీ దేశభక్తి పూనకం లాగ వచ్చేసింది.

"ఇస్‌దేశ్‌కి ధరితీ, పూనకంలాగ వచ్చేసింది.

మా కాలనీ ఆడాళ్ళంతా కలసి అప్పటికప్పుడే ఓ ఆదివారం మీటింగ్ ఏర్పాటు చేశారు. మీటింగ్ ఏర్పాటుచేసింది మా కాలనీ ఉమెన్స్ అర్గనైజేషన్ కాబట్టి మేమంతా కూడా గత్యంతరం లేక హాజరయ్యాం.

"దేశం పిలుస్తోంది రా! కదలిరా!" అని స్వయంగా ప్రధానమంత్రి వాణే టీవీలో

మోగుతోంది కాబట్టి మనమంతా ఉడతాభక్తి సాయం చేయాల్సిందే" అంది పార్వతీదేవి వేదికమీదనుంచి.

"అవును! మనమంతా పొదుపు చెయ్యాలి!" అంది రాజేశ్వరి.

"పొదుపంటే ఖర్చులోనే కాదు– అన్నిటిలోనూ పొదుపు చేయాలి" అంది సావిత్రమ్మగారు.

ఆ మార్నాటి నుంచే అన్ని విషయాల్లోనూ పొదుపు చెయ్యాలని అందరూ నిర్ణయించేశారు. దుబారా విషయంలో ఆడాళ్ళకంటే మగాళ్ళే ఎక్కువ చొరవ తీసుకోవాలని వాళ్ళనేసరికి మేము కొంచెం ఇబ్బందిలో పడ్డాం.

"రోజుకి ఓ సిగరేట్ పెట్టె కాల్చేవాళ్ళు సగం పెట్టె కాల్చాలి" అంది శ్రీవల్లి.

వాళ్ళాయనను సిగరెట్లు మాన్పించడానికి అంతకంటే మరో ఉపాయం తట్టలేదామెకి. సరేనన్నారు చాలామంది.

"సుపారీ పొట్లాలు కూడా తగ్గించాలి" అన్నారు వారు.

అదీ ఒప్పుకున్నాం.

సినిమాలు కూడా వారానికొకటల్లా నెలకు రెండుకి తగ్గించాలి.

ఎక్కువ పొదుపు చేసినవారికి కాలనీ కమిటీ తరపున 'పొదుపురత్న" అవార్డు కూడా ఇవ్వాలని రంగారెడ్డి సూచించాడు.

మర్నాటి నుంచీ పొదుపు డిల్ ప్రారంభమయింది.

"పొదుపు చేసిన ప్రతి నీటిచుక్కా ప్రగతికి సోపానం" అన్న అంశంతో రోజుని ప్రారంభించాలని అందరం అనుకోవడం చేత నేను రోజూ బక్కెట్ నీళ్ళు స్నానానికి వాడేవాడినల్లా అర బక్కెట్‌కి తగ్గించి స్నానం చేయాలని నిర్ణయించుకొని బకెట్ తీసుకొని బాత్ రూమ్‌కి చేరుకున్నాను. తీరా చూస్తే పంపులో నీళ్ళు రావటం లేదు.

"వేసవికాలం మొదలయిందికదా! బహుశా నీళ్ళు మామూలు సప్లయ్ వుండదు కాబోలండీ" అంది మా అవిడ.

"మరిప్పుడెలా?"

"ఇవాళింకేం స్నానం చేస్తారూ– సాయంత్రం చేద్దురుగాన్లెండి! ఆఫీసుకి టైమవుతోంది వెళ్ళండి" అంది.

గత్యంతరం లేక స్నానం లేకుండా ముఖం కడుక్కుని డ్రస్ చేసుకొని బయటకొచ్చాను.

"ఇవాళ నీళ్ళు ఆదా చేయటానికి ఛాన్స్ దొరకలేదు" అన్నాడు రంగారెడ్డి.

"పోన్లే రేపట్నుంచి చేద్దాం" అన్నాడు శాయీరాం.

"ఏమిటి? ఎవరూ స్కూటర్లు లేకుండా వచ్చారా?" అడిగాడు జనార్ధన్ మేము రావటం

చూసి.

మేము విజయగర్వంతో నవ్వాం.

"పిచ్చివాడా! ఇంధనాన్ని ఆదా చేయటం ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆదా చేయండి! అని మన దూరదర్శన్ చెప్పటం లేదూ?? ఈ పని మనం తేలికగా చేయగలం! కనీసం మనం తేలిగ్గాం చేయగలిగిన పనులన్నా చేయకపోతే ఎలా?" అన్నాడు రంగారెడ్డి.

"నిజమే! నేనూ ఇవాళ్టినుంచి మోటార్ సైకిల్ బయటకు తీయను"

అందరూ బస్టాప్‌లో నిలబడ్డారు.

బస్‌లు వరుసగా వస్తున్నయ్‌గానీ అన్నింట్లోనూ జనం ఫుట్‌బోర్డ్ బయట ఓ మీటర్ డయామీటర్‌లో వేలాడుతున్నారు.

చివరకు ఆ ఇరుకులోనే దూరి నిలబడ్డాం.

బస్‌గంటకు ఐదు కిలోమీటర్ల వేగంతో నడుస్తోంది. కొంచెం రోడ్ ఎత్తు వచ్చినచోట మాత్రం ఓసారి ఎత్తు ఎక్కలేక వెనుకకు దొల్లి పోయింది గానీ డ్రయివర్ మళ్ళీ గేరు మార్చి ముందుకి నడిపాడు.

ప్రతి స్టేజీలోనూ లోపల్నుంచి దిగాలంటే ఐదు నిమిషాలు, ఎక్కాలంటే పది నిముషాలు పడుతోంది.

చివరకు మేము ఆఫీసు చేరుకునేసరికి పదకొండయింది.

ఆ పూటకి లీవ్ లెటర్ రాయించుకున్నాడు మా సూపర్నెంట్.

"అనవసరంగా లీవ్ తీసుకున్నాం! లీవ్ దుబారా ఐపోయింది" అన్నాడు రంగారెడ్డి.

"అంతేకాదు! అవసరం ఉన్నప్పుడు వాడుకోవడానికి లీవ్ దొరక్కుండాపోతుంది" అన్నాడు శాయిరామ్.

"ఛూ! నీ యవ్వ బస్‌లు! రేపటికెళ్ళి నా స్కూటర్లో నేనొస్తాభయ్! ఈ పెట్రోల్ పొదుపు నాతోని కాదు" అన్నాడు యాదగిరి.

ఆ సాయంత్రం మళ్ళీ బస్‌లో ఇల్లు చేరుకునే సరికి ఏడున్నరయిపోయింది.

"ఏమిటింత ఆలస్యంగా వచ్చారు? పిల్లలకు హోమ్‌వర్క్ ఎప్పుడు చెప్తారింకా?" అన్నారు ఆడాళ్ళు.

"పెట్రోలు ఆదా చేశాం కాబట్టి హోమ్‌వర్క్‌కి టైముండదు. వాళ్ళనే చేసుకోమనండి!" అన్నారు మగాళ్ళు.

"ఇప్పుడు మనం కరెంట్ ఆదా చెయ్యాలి! త్వరగా భోజనం చేసేద్దాం పదండి" అంది మా ఆవిడ.

అందరం భోజనం గదిలో కెళ్ళేసరికి కరెంట్‌పోయింది.

అరగంటసేపు ఎదుర్చూసినా గానీ కరెంట్ రాకపోయేసరికి మాకు నిరాశ కలగటం మొదలు పెట్టింది.

రోజూ పదిగంటల వరకూ లైట్లు వెలుగుతూండేవి. ఆ రోజు నుంచీ తొమ్మిది గంటలకే లైట్లు ఆర్పివేస్తే చాలా కరెంట్ కలిసొస్తుందని అనుకున్నాం.

రాత్రి పదయినా కరెంట్ రాలేదు.

అందరం కొవ్వొత్తులు కొనుక్కొచ్చి వాటిని వెలిగించుకున్నాం.

"ఇవాల్టి నుంచీ 'పవర్ కట్' అని పేపర్‌లో వేశారండీ మర్చేపోయాం" అంది పక్కింటావిడ.

ఎప్పుడు నిద్రపట్టిందో మాకు తెలీదు. తెల్లారుజామున నాలుగింటికి మెలకువ వచ్చింది. అదీ పార్వతీ గాంగ్‌వాళ్ళు తలుపు తట్టబట్టి. "ఏమిటి ఇంత ప్రొద్దున్నే వచ్చారు?" అడిగింది మా ఆవిడ నిద్రకళ్ళల్లో.

"పొదుపు చేయటమంటే రాత్రంతా లైట్లు, ఫానులు వేసుకుని పడుకున్నారేమిటి? పైగా ఆ టీవీ కూడా ఆఫ్ చేసినట్లులేదు" అన్నారు వాళ్ళు.

"నిద్రపోయాక కరెంట్ వచ్చినట్లుంది" అన్నాను గొణుక్కుంటూ.

"త్వరగా లైట్లార్పి ఆదా చేయండి"

నేను లైట్ స్విచ్ దగ్గర కెళ్ళేసరికి మళ్ళీ 'పవర్‌కట్' వచ్చేసి ఇల్లంతా చీకటయిపోయింది.

అప్పుడు వినిపించింది పంపు నుంచీ నీళ్ళు వస్తోన్న ధ్వని.

మా ఆవిడ కెవ్వున కేకవేసి వంటింట్లోకి పరుగెత్తింది.

"అయ్యయ్యో! ఇంట్లో చుక్క నీళ్ళు లేవు– వాడు రాత్రి నీళ్ళు వదలినట్లున్నాడు. తెల్లార్లూ నీళ్ళు కాస్తా పోయాయ్ దుబారా అయిపోయాయ్" అని నెత్తీ నోరూ బాదుకుంటూ బక్కెట్లతో నీళ్ళు నింపసాగింది. రెండు బక్కెట్లు నిండేసరికి నీళ్ళు రావటం ఆగిపోయింది.

ఆడవాళ్ళంతా అప్పుడే బయట గుమిగూడి అందరినీ పిలవటం మొదలుపెట్టారు.

"ఇవాళ కాలనీ అంతా చెట్లు నాటాలికదా! కాలుష్యం నివారణకు మనకు చేతనైనంత సాయం మనం కూడా చేద్దాం!" అంటోంది పార్వతీ దేవి.

మరికాసేపట్లో ఆడాళ్ళంతా కలసి కాలనీ కమిటీవాళ్ళు ఫారెస్టు డిపార్ట్‌మెంట్ నుంచి తీసుకొచ్చిన మొక్కలు కాలనీ అంతా ప్రతి ఇంటి ముందూ ఓ మొక్క చొప్పున నాటారు. నాటాక గుర్తొచ్చింది అందరికీ– వాటికి పోయడానికి నీళ్ళులేవని.

"ఇప్పుడెలా?" అంది రాజేశ్వరి.

ఎవరికీ నోట మాట రాలేదు.

"పోనీ ఇవాళ ఒక్కరోజు ఎలాగోలా పోద్దామన్నా రేపట్నుంచి ఎలా? ఈ సమ్మర్

అంతా నీళ్ళు సరిగ్గా దొరకనే దొరకవ్? మనకి–" అంది సావిత్రమ్మ.

అందరూ తీవ్రమైన ఆలోచనలో పడ్డారు.

రంగారెడ్డి చాలాసేపు ఆలోచించాక నెమ్మదిగా అన్నాడు. "మీరెవరూ మరోలా అనుకోనంటే ఓ చిన్న ఐడియా."

"ఏమిటిది?" ఆతృతగా అడిగారు ఆడాళ్ళు.

"ప్రతి ఇంట్లోనూ చిన్న పిల్లలుంటారు కదా! వాళ్ళతో రోజూ ఉచ్చ ఈ చెట్ల దగ్గరే పోయిస్తే బ్రతుకుతాయోమో"

అందరూ రంగారెడ్డి మీద విరుచుకుపడ్డారు.

ఆ రోజు సాయంత్రానికి మొక్కలు వాడిపోయాయి. మర్నాటి ఉదయానికి చచ్చిపోయాయి.

మేమంతా ఇప్పుడు నీళ్ళు ఆదాచేయటం కోసం కేవలం నాలుగు చెంబుల నీళ్ళు మాత్రమే స్నానానికి వాడుతున్నాం– అంచేత నీటి విషయంలో కొంతవరకూ పొదుపు చేయడానికి వీలైంది.

కరెంట్ కూడా రాత్రి ఏడునుంచీ తొమ్మిదివరకూ ఉంటుంది. గనుక ఆ రెండు గంటల్లో ఓ గంటే వాడి ఓ గంట ఆదా చేస్తున్నాం. కరెంట్ తీసేసిన సమయంలో రంగారెడ్డి వాళ్ళమ్మమ్మ బాత్‌రూమ్‌కి వెళ్ళబోయి చీకటితో ఓ బల్ల తగిలేసరికి కాలు ఫ్రాక్చరయ్యింది. ఆమెను హాస్పిటల్‌లో చేర్చాం అందరం.

ఆ రోజు మేము ఆఫీసు కెళ్ళేసరికి మిగతా గుమాస్తాలందరూ బల్లలకింద, అల్మారాల కిందా ముక్కుకు కర్చీఫ్‌లు అడ్డంగా పెట్టుకుని వెతకసాగారు.

"ఏమిటి?" అడిగాడు రంగారెడ్డి.

"ఎక్కడో ఎలుకలు చచ్చినట్లున్నయ్– నిన్న కూడా ఇలాగే వాసన వచ్చింది–" అన్నారు వాళ్ళు. మేము కూడా వెతికాంగానీ ఎక్కడా ఎలుకల శవాలు కనిపించలేదు.

మేమంతా బయటికెళ్ళి నిలబడి ప్యూనతో మొత్తం పర్నీచర్ అంతా జరిపి చూడమన్నాం. వాళ్ళు వెంటనే బయటికొచ్చారు మళ్ళీ. ఇప్పుడేం వాసనలేద్సార్?" అన్నారు ఆశ్చర్యంగా. అందరూ మళ్ళీ లోపలికెళ్ళారు. నేనూ రంగారెడ్డి, శాయిరామ్ మాత్రం కాంటీన్ కెళ్ళి కాఫీ తాగి మళ్ళీ కాసేపట్లో చేరుకునేసరికి అందరూ ఠక్కున ముక్కులు మూసుకున్నారు. అప్పుడర్థమైంది మాకూ వాళ్ళకూ కూడా.

ఆ చచ్చిన ఎలుక వాసన మా దగ్గర్నుంచే అనీ– ప్రభుత్వం దూరదర్శన్‌లో ఇస్తున్న ప్రకటనలు అమలు పరచడానికి నీళ్ళు పొదుపు చేస్తున్నామనీ అందుకే కొంచెం కుళ్ళు వాసన వస్తుందేమోననీ చెప్పాం వాళ్ళకు. మాతో బలవంతంగా శెలవు పెట్టించి ఇంటికి

పంపించారు వాళ్ళు.  మేము నీళ్ళ విషయంలో పొదుపు పాటించినంత కాలం ఆఫీస్‌కి రాకూడని కూడా నిష్కర్షగా చెప్పారు. తీరా మేము ఇళ్ళు చేరుకునేసరికి పిల్లలు కూడా ఇంటి బయటే ఆడుకుంటూ కనిపించారు.

"ఏమిటి? మీరు స్కూలు కెళ్ళలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాల్రావ్.

"వెళ్ళి వచ్చేశాం"

"అప్పుడే ఎలా వచ్చారు స్కూలు సాయంత్రం మూడు వరకు కదా?"

"మా ప్రిన్సిపాల్ ఇంటికి పంపించేశారు కాలనీ పిల్లలందరినీ"

"ఎందుకని?"

"మేము మరీ మురికిగా వున్నామంట–"

ఈలోగా మా ఆవిడ చిరాకుగా బయటకొచ్చింది.

"చూశారా వీళ్ళ ప్రోగ్రెస్ రిపోర్టులు – అందరికీ జీరోలు." మేము ఉలిక్కిపడ్డాం.

వాళ్ళకు ఇంతవరకూ ఏ పరీక్షల్లోనూ పాస్ మార్కులు తగ్గలేదు. అలాంటిది సడెన్‌గా జీరోలు రావటం ఎలా జరుగుతుంది??

"ఏమిటి జీరోలా?" వాళ్ళను నిలదీశాడు జనార్ధన్ బెల్ట్ తీసుకుని కొట్టడానికి రెడీ అవుతూ.  వాళ్ళు ఏడుపు మొఖాలు పెట్టారు.

"మాట్లాడరేం? చెప్పండి! చదువంటే ఇంట్రెస్ట్ పోయింది! అవునా? ఇరవై నాలుగ్గం టలూ ఆ టీవీ ముందు కూర్చోవటం వల్లే బ్రెయిన్స్ దెబ్బతిని ఇలా తయారయ్యారు– అంతేనా?"


"కాదు– మాకు చదువుకోడానికి లైట్లు వుండటం లేదుగా! మీరు ఎనిమిదింటికే లైట్లార్పేస్తున్నారు" అందరం మొఖాలు చూసుకున్నాం.

"మనకు ఈ పవర్ కట్స్‌తో కరెంట్ ఉండేదే రాత్రి ఏడుగంటల నుంచి తొమ్మిది వరకూ! ఆ రెండుగంటల్లో కూడా పొదుపు చేస్తే మళ్ళ పిల్లలు పెద్దయాక అడుక్కుతింటారు" అన్నాడు  చంద్రకాంత్.

"నిజమే! గవర్నమెంటే మనకి పవర్ సప్లయ్ లేకుండా చేసి ఇంకా సిగ్గులేకుండా "విద్యుత్‌ని ఆదాచేయి" అంటూ పిచ్చివాగుడు వాగిస్తారేమిటి ఆ టీవీ ద్వారా?" అడిగింది పార్వతీదేవి.

"నీళ్ళు కూడా అంతే! నీళ్ళు రోజు విడిచి రోజు సప్లయ్ చేస్తుంటే ఆ మెంటల్ నినాదాలేమిటి "ప్రతి నీటి చుక్కా ప్రగతికి సోపానం" అంటూ రాజేశ్వరి కోపంతో అంది.

"పెట్రోలు ఆదా చేస్తే ఏమౌతుందో చూశారుగా! రోజూ ఆఫీసుకి లేటే! దాంతో శెలవులు ఎక్కువ ఖర్చయి, అవసరానికి శెలవులు లేక, జీతాల్లేక, జీతం నష్టం మీద




శెలవు తీసుకోవలసి వస్తుంది–" అంది సావిత్రమ్మ, అక్కడి నుంచి అందరూ తలోమాటా మాట్లాడసాగారు.

"అసలే తాగటానికి క్కూడా నీళ్ళు లేక ఛస్తుంటే– చెట్లు పెంచండి– పచ్చదనం ప్రగతిని సోపానం– అంటూ అడ్డమై వాడూ చిల్లర నినాదాలే."

"మనకొచ్చే జీతాలేమో గొర్రెకు బెత్తెడు తోకలు– అది చాలక అందరం ముష్టివాళ్ళల్లాగా బ్రతుకుతున్నాం నచ్చిన బట్టకట్టుకోలేం– తినాలనుకున్నవి తినలేం– చేయాలనుకున్న వేమీ చేయలేం– అయినా గానీ ఇంకా పొదుపు చేయాలంటే ఏం చేయాలి? ఓ పూట తిని రెండో పూట పస్తుండాలా? ఈ కొద్ది రోజులు పొదుపు చేసే సరికే మన కాలనీలో ఎనిమిదిమందికి ఎనీమియా వచ్చి డాక్టర్ల దగ్గరకెళ్ళి టానిక్‌లు కొనుక్కున్నారు."

"అయినా మా బ్రతుకుల్ని బాగుచేయమనీ, మమ్మల్నీ ముష్టి బ్రతుకుల నుంచి ఉద్ధ రించమనీ మనం ఈ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే గెలిచిన మర్నాటినుంచే పొదుపు చేయండి, విద్యుత్ వాడకండి, నీళ్ళు ఆదా చేయండి, పెట్రోల్ వాడకండి, ప్రయాణాలు చేయకండి అంటూ మరింత దిక్కుమాలిన బ్రతుకులు బ్రతకమంటారేమిటి? ఇలాంటి మెంటల్ గాళ్ళ నెందుకు ఎన్నుకోవాలి మనం? ఇంకొకసారి ఓట్ల కోసం ఇంటికి రానీండి! చెప్పు తీసుక్కొడతాను" అంది శ్రీవల్లి. ఆ రోజు నుంచీ మళ్ళీ ఎప్పుడూ మా కాలనీ వాళ్ళు దేశభక్తి గీతాలు, కార్యక్రమాలు, నినాదాలు విని ఉత్తేజితులవలేదు.

* * * * *